
జిందగీ
# చింతన

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం
17 జూన్ 2024
www.ntnews.com
9



ఏకాదశి తిథి పావనమైనది. ప్రతి నెలలో రెండు ఏకాదశి తిథులు వస్తుంటాయి. దేనికదే ప్రత్యేకమైనది. జ్యేష్ఠ శుక్ల ఏకాదశిని నిర్జల ఏకాదశి అని పిలుస్తారు. పద్మ పురాణం 14వ అధ్యాయంలోని 'క్రియా సాగర సారం' ఏకాదశి మాహాత్మ్యాన్ని తెలియజేస్తుంది. శ్రీ మహావిష్ణువు యోగ నిద్రావస్థలో ఉన్న సమయంలో స్వామి దివ్య శరీరం నుంచి ఏకాదశి మూర్తి ఆవిర్భవించింది. సమస్త పాపాలను హరించి, మోక్షాన్ని ప్రసాదించే ఈ మూర్తి ప్రతి మాసంలో పదకొండో రోజుకు అధిష్ఠాన మూర్తి అయి భక్తులను అనుగ్రహిస్తున్నది.

## ఆహారం త్యజించు.. శ్రీహరిని స్మరించు

నేడు నిర్జల ఏకాదశి

**ప్రతి** పక్షం రోజులకు ఒకసారి ఏకాదశి తిథి ఉపవాసం ఉండి, భగవత్ ధ్యానంలో గడిపిన వారి సకల పాపాలూ తొలగిపోతాయనీ, వైకుంఠం ప్రాప్తిస్తుందని పురాణ వచనం. లోకంలోని జీవులంతా ఏకాదశి నాడు ఉపవాసం ఆచరించడంతో పాప పురుషుడికి లోకంలో స్థానమే లేకుండా పోయిందట. దీంతో పాప పురుషుడు విష్ణుమూర్తిని శరణువేడి తాను లోకంలో నివసించడానికి ఒక స్థానాన్ని ప్రసాదించమని కోరాడట. అప్పుడు మహావిష్ణువు 'ముల్లోకాలను పావనం చేసే ఏకాదశి నాడు నువ్వు తృణధాన్యాల్లో నివసించు. అప్పుడు నా స్వరూపమైన ఏకాదశీ దేవి నిన్ను ఆటంకపరచదు' అని అభయమిచ్చాడట. కాబట్టి, ఏకాదశి తిథినాడు పాప పురుషుడు కొలువుదీరే ఆహారం తినరాదని శాస్త్రం సూచించింది. ఏకాదశి వ్రతం ఆచరణలోని పరమార్థాన్ని హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు వివరిస్తూ.. 'ఏకాదశి తిథి నాడు కేవలం ఆహారాన్ని త్యజించడమే కాదు, వీలైనంత సమయం భగవత్ సేవలో గడపడమే ఉపవాస దీక్షలోని మూల ఉద్దేశం. ఉపవాసం ఆచరించే తిథుల్లో గోవిందుడి లీలలను స్మరించడం, నామ సంకీర్తనం గావించడం మేలైన పనులు' అని తెలియజేశారు.

### భీముడికి ఉపశమనం

ఒకసారి భీముడు వ్యాసమహర్షిని కలిసి.. 'పితామహా! నా సోదరుడు యుధిష్ఠిరుడు, తల్లి కుంతీ దేవి, భార్య ద్రౌపది, ఇతర సోదరులు ప్రతి ఏకాదశి నాడు నియమానుసారంగా పూర్తి ఉపవాసం ఉంటున్నారు. నన్ను కూడా ఉపవాసం ఉండమని చెబుతుంటారు. కానీ, నేను తినకుండా ఉండలేను. వాయుదేవుని కుమారుడిగా సమాన ప్రాణ (జీర్ణవాయువు) ఆకలి నేను భరించలేను. నేను విరివిగా దానధర్మాలు చేయగలను. సకల ఉపచారాలతో కేశవుడిని నిష్ఠగా పూజించగలను. కానీ, ఏడాది పొడవునా నెలలో రెండుసార్లు ఉపవాసం చేయాలంటే మాత్రం నా వల్ల కాదు మరి! నాకు ప్రయోజనాన్ని కలిగించే మరో మార్గమేదైనా ఉంటే తెలియజేయండి' అని అడిగాడు. అప్పుడు వ్యాస భగవానుడు ''సంవత్సరస్య యా మధ్యే ఏకాదస్యో భవన్తి హి తాషామ్ ఫలమ్ అవాప్నోతి పుత్ర మే న అత్ర సంశయః ఇతి మామ్ కేశవః ప్రాహ శంఖ చక్ర గదాధరః'- పుత్రా ! 'ఒక సంవత్సరంలోని ఏకాదశిలన్నిటినీ ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనం కేవలం ఈ నిర్జల ఏకాదశి (జ్యేష్ఠ శుక్ల ఏకాదశి) ఆచరించడం వల్ల కలుగుతుంద'ని సాక్షాత్తుగా శంఖ చక్ర గదాధరుడైన కేశవుడే నాతో స్వయంగా తెలిపాడు. ఇందులో ఎటువంటి సందేహం లేదు' అని తెలిపాడు. 'ఆనాడు నువ్వు మంచినీటిని కూడా సేవించక సంపూర్ణ ఉపవాసం ఆచరిస్తే.. ఏడాదిలోని అన్ని ఏకాదశులూ ఉపవాసం ఉన్న ఫలితం వస్తుంద'ని వివరించాడు.

... శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ
93969 56984

## రైతుకు దన్నుగా.. నిండు పున్నమ

శనివారం ఏరువాక పౌర్ణమి

**ఆధ్యాత్మిక** సాధకులకు పౌర్ణమి విశేష తిథి. ఆనాడు మనసు నిశ్చలంగా ఉంటుందనీ, భగవత్ ఆరాధనకు అనుకూలమనీ భావిస్తారు. జ్యేష్ఠ పౌర్ణమి కార్యసాధకులైన కర్షకుల తిథి. హలం పట్టి.. పొలం దున్నడానికి వారిని ఉద్యుక్తులను చేసే పర్వం ఇది. అదే 'ఏరువాక పౌర్ణమి'. ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అనీ, ఏరువాక అంటే దున్నడానికి వెళ్లడమనీ అర్థం. జ్యేష్ఠ మాసం సగానికి వచ్చేసరికి.. రుతుపవనాలు విస్తరించి వానలు మొదలవుతాయి. పుడమి తల్లి మెత్తబడి.. దున్నకానికి సిద్ధమవుతుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 'ఏరువాక'కు సాగిపోతారు రైతులు. పౌర్ణమి నాటికి మృగశిర కార్తె ప్రభావంతో జల్లులు మొదలవుతాయి. ఆపై వచ్చే ఆరుద్ర నుంచి పుబ్బ కార్తె వరకు పడే వర్షాలపైనే పంటలు ఆధారపడి ఉంటాయి. 'ఏరువాక' పౌర్ణమి సందర్భంగా సమృద్ధిగా వానలు కురవాలని రైతులు దైవాన్ని ప్రార్థిస్తారు. పంట పనుల్లో తమకు చేదోడు వాదోడుగా ఉండే పశువులను పూజిస్తారు. పశువులను, నాగలి, పార, గునపం వంటి పరికరాలను శుభ్రం చేసి పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. ఎడ్లను చక్కగా అలంకరించి, వాటి కొమ్ములకు రంగులు అద్దుతారు. పొలం పనుల్లో తమకు అండగా నిలవాలని కోరుకుంటారు. పొంగలి వండి వాటికి నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాత రైతులంతా ఉమ్మడిగా పొలంలోకి దిగి దుక్కులు దున్నే కార్యక్రమం చేపడతారు.



... శ్రీచరణ్

ఉపనిషత్ వాక్యం

## స్తోత్ర మహిమ

ఆదరేణ యథా స్తౌతి ధనవన్తం ధనేచ్ఛయా।
తథా చే ద్విశ్వకర్తారం కో న ముచ్యేత బంధనాత్॥
(వరాహోపనిషత్తు 3-13)

ధనం కోసం ధనవంతుని ఎంతో ఆదరంతో ఎలా స్తుతిస్తారో అలాగే జగత్కర్తయైన పరమాత్మను స్తుతిస్తే ఎవరు బంధాల నుంచి విముక్తుడు కాకుండా ఉంటారు?.. అని పై శ్లోకానికి భావం. కవులు ఏవేవో రాస్తుంటారు. దేవుళ్లను స్తోత్రం చేస్తూ ఉంటారు. ఇదంతా ఏదో కాలక్షేపం కోసమే కదా! అనేవాళ్లు పై శ్లోకాన్ని పరిశీలిస్తే విషయం అర్థమవుతుంది. కవులు రాసే స్తోత్రాల వల్ల కలిగే మహత్ ప్రయోజనం ఏమిటో అవగతమవుతుంది. స్తోత్ర ప్రియుడైన పరంధాముడు భక్తుల బంధాలన్నీ తొలగించగలడు. పదకవితా పితామహుడైన అన్నమయ్య భక్తి సంకీర్తనలకు ప్రజలు ముగ్ధులయ్యేవారు. ఆయన కీర్తి ఆనాటి ప్రభువైన సాళువ నరసింహరాయల దాకా పాకింది. రాజు.. అన్నమయ్యను తన ఆస్థానానికి రప్పించుకున్నాడు. పాట పాడమన్నాడు. 'ఏమొకో చిగురుటధరమున ఎడనెడ కస్తూరి నిండెను' అనే శృంగార కీర్తనను.. భక్తి రసభరితంగా ఆలపించాడు అన్నమయ్య. రాజు పరవశించిపోయి తన మీద కూడా ఒక కీర్తన పాడమన్నాడు. తన జిహ్వ వెంకటరమణుని తప్ప మరొకని కొనియాడదన్నాడు అన్నమయ్య. రాజు కోపించి, అన్నమయ్యను చెరసాలలో బంధించాడు. బాధాతప్త హృదయంతో అన్నమయ్య కన్నీరు మున్నీరుగా విలపిస్తూ 'ఆకటి వేళల అలపైన వేళల తేకువ హరినామమే దిక్కు.. మరి లేదు' అనే కీర్తన ద్వారా తన మనోవేదన అంతా స్వామికి నివేదించుకున్నాడు. తక్షణమే అత్యాశ్చర్యకరంగా అందరూ చూస్తుండగానే అన్నమయ్య సంకెళ్లు పుటపుటమంటూ తెగిపడిపోయాయి. రాజు పశ్చాత్తాపంతో పరమ భాగవతోత్తముడైన అన్నమయ్య పాదాలపై పడి శరణు వేడుకున్నాడు. అనేక జన్మలుగా కొనసాగి వస్తున్న భవబంధాల నుంచే జీవుని విడిపించగలిగే పరంధాముని కరుణా కటాక్షాలు.. అన్నమయ్య మామూలు సంకెళ్లను విడిపించడంలో నిజానికి ఆశ్చర్యం ఏమున్నది?



... డా.వెలుదండ సత్యనారాయణ

ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలామ్) త్యాగానికి చిహ్నంగా ముస్లింలు ఏటా బక్రీదు పర్వదినాన్ని జరుపుకొంటారు. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం జీవితం బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అడుగడుగునా ఎన్నో పరీక్షలు ఎదుర్కొన్నారు. మరెన్నో త్యాగాలు చేశారు. పుత్రునిగా, భర్తగా, తండ్రిగా, ప్రవక్తగా, విశ్వాసపాత్రుడైన దైవదాసుడుగా ఆయన తన కర్తవ్య నిర్వహణలో ఎన్నడూ వెనుకంజ వేయలేదు.

## త్యాగానికి ప్రతీక

ఇస్లాం బోధ

**సరిగ్గా** ఐదువేల సంవత్సరాల క్రితం సంఘటన.. ప్రవక్త ఇబ్రాహీం (అ) హాజిరా దంపతులు. హజ్రత్ ఇబ్రాహీం (అ)కు వయసు పై బడుతున్న కొద్దీ తన తదనంతరం దైవ సందేశ కార్యభారాన్ని నిర్వర్తించడానికి సంతానం ఉంటే బాగుండునన్న కోరిక కలిగేది. దైవం పండంటి బిడ్డను ప్రసాదించాడు. లేకలేక కలిగిన బిడ్డను అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు. కొంత కాలానికి ప్రవక్త ఇబ్రాహీం (అ)కు ఓ కఠినమైన పరీక్ష ఎదురైంది. ఐతే ఇది మామూలు పరీక్ష కాదు. ఈసారి దైవం ఏకంగా కన్నకొడుకునే బలి చెయ్యమని కలలో ఆదేశించాడు. దివ్యఖురాన్‌లో ఇబ్రాహీం త్యాగనిరతిని అల్లాహ్ ప్రస్తావించాడు. ''మేము అతనికి ఒక సహనశీలుడైన కుమారుడు కలుగుతాడనే శుభవార్తను అందజేశాము. ఆ బాలుడు అతనికి తోడుగా పనిచేసే వయస్సుకు చేరుకున్నప్పుడు (ఒకనాడు) ఇబ్రాహీం అతనితో..''కుమారా! నేను నిన్ను 'జిబహ్' (బలి) చేస్తున్నట్లుగా కలలో చూశాను. ఇక నీ అభిప్రాయమేమిటో చెప్పు'' అని అడిగాడు. ''నాన్నగారూ! మీకు ఆజ్ఞాపించిన దానిని నెరవేర్చండి. అల్లాహ్ సంకల్పిస్తే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు'' అని బదులిచ్చాడు. చివరికి ఇద్దరూ దైవాజ్ఞను శిరసావహించారు.


**కొడుకు** ఇస్మాయీల్ కూడా తండ్రికి తగ్గ తనయుడే. దేవుడు కలలో చూపించిన ఆదేశాన్ని అమలు చేయాలని కొడుకు ఇస్మాయీల్ తండ్రికి ఎంతో నిబ్బరంగా చెప్పాడు. తన తల్లికి సలాములు చెప్పాలని తండ్రిని కోరాడు. తన గుర్తుగా ఈ దుస్తులు తల్లికి ఇవ్వాలని చెప్పాడు. ఇబ్రాహీం (అ) తన కత్తికి పదును పెట్టారు. కుమారుడిని గట్టిగా కౌగిలించుకుని రోదించారు. బరువెక్కిన హృదయంతో కత్తిని లేపారు. పసి ఇస్మాయీల్ గొంతుపై కత్తి వేటు వేశారు. కానీ ఆ కత్తి గొంతును కోయలేదు. ఇబ్రాహీం ఆశ్చర్యపోయారు.

''ఇబ్రాహీం నీవు కలను నిజం చేసి చూపించావు. మేము నీ విధేయతకు బహుమానం ప్రసాదిస్తున్నాము'' అన్నాడు అల్లాహ్. దైవానికి కావలసింది బలికాదు. ఆయన నిబద్ధతను పరీక్షించదలిచాడు. ఇస్మాయీల్‌కు బదులుగా బలివ్వడానికి స్వర్గంనుంచి పొట్టేలును పంపించాడు అల్లాహ్. పొట్టేలును బలిచ్చారు. ఈ త్యాగానికి ప్రతీకగానే ముస్లింలు ఏటా బక్రీదు పండుగను జరుపుకొంటారు. ఆ నాడు ఆ తండ్రీకొడుకులు చేసిన త్యాగాన్ని స్మరిస్తూ నేడు ముస్లింలు ఖుర్బానీ ఇస్తుంటారు. నాడు వారిద్దరు తమ సర్వస్వాన్ని త్యాగం చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దైవ మార్గంలో పణంగా పెట్టారు. అలా ఖుర్బానీ ఇచ్చిన మాంసాన్ని పేదలకు పంచిపెడతారు.




... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

## పరమపురుషుని లీలా పరమార్థం




'ఈశ్వరస్యాపి అభిమాన ద్వేషిత్వాత్ దైన్య ప్రియత్వాచ్చ' (నారద భక్తి సూత్రం)- భగవంతునికి అభిమానం- అహంకారం అంటే ద్వేషం- అయిష్టం. దైన్యం- దీన భావమంటే చాలా ఇష్టం. 'గోవత్స అపహరణ' లీల మొదలు ఒక్కొక్క లీలలో అధికార మదంతో ఒళ్లు తెలియక విర్రవీగిన- అహంకరించిన ఒక్కొక్క దేవతని ఆదిదేవుడు మాధవుడు కర్రు కాల్చి వాతపెట్టి- పరాభవించి కళ్లు తెరిపించాడు. ఈ పరాజయ లీలా పరంపర సురజ్యేష్ఠుడు పితామహునితో ప్రారంభం. పదంపడి- పిమ్మట గోవర్ధన లీలలో గోత్రభిదుని- ఇంద్రుడి పరాభవం. పీతవసనుని- పీతాంబరధరుని వరుణ లోక గమనం రసేంద్రియ (జిహ్వ) జయానికి సంకేతం. అకాముని, మన్మథ మన్మథుని, వాసుదేవుని రాసలీల కామవిజయ లీల!

గోపబాల, గోవత్స అంతర్ధాన లీలని వ్యాఖ్యాతృ చక్రవర్తి శ్రీధరాచార్యులు 'సర్వము తానయైన' వాని 'సర్వోదయ లీల'గా శ్లాఘించారు. యదునందనుడు, తనయుడై తన తల్లి యశోదకు కలిగించిన అమంద ఆనందాన్నే మంద- బృందావనంలోని కుందరదనలు గోపికలకు, గోపకులకు, గో గోవత్స గోపబాలురందరికి అనుగ్రహించాడు. తాడు తాడుగానే ఉండి తాముగా, దామము- దండగా, జలధారగా పలువురికి పలువిధాలు ప్రతీత- ప్రకటమయింది. పరబ్రహ్మము తన స్వరూపానికి భంగం- పరిణామం లేకుండానే మాయాశక్తితో నానా నామ రూప జగత్తుగా భాసిస్తోంది. 'మత్తః పరతరం నాన్యత్ కంచి దస్తి ధనంజయ' (గీత) (నాకంటే పరమ కారణమైనది- ఇతరమైనది ఏదీ లేదు. ఈ జగత్తులోని జడ చేతనాలన్నీ దారంలో మణులవలె నాయందే కూర్చబడి ఉన్నాయి). ఎన్ని విధాల గోచరించినా వెన్నుడు (విష్ణువు)- కన్నయ్య తప్ప అన్యమైన దేదీ లేదు. ఇదీ ఈ లీలా పరమార్థం! భగవల్లీలా కథా శ్రవణం వినోదానికి- కాలక్షేపానికి కాదు. అజ్ఞానం అపనోదనానికి- తొలగడానికి, తత్త్వజ్ఞాన వికాసం కలగడానికి! ఇక తరువాతి కథలోకి... శుకుడు పరీక్షిత్తుతో- రాజా! బ్రహ్మదేవుడు మాయచేసి దాచిన దూడలను, బాలురను వృష్ణికులాంభోజ సూర్యుడు- వృష్ణి వంశమనే కమలాన్ని వికసింప జేసే సూర్యుడు, వైష్ణవ సాగర హిమకరుడు- విష్ణు భక్తులనే సాగరానికి చంద్రుడు (ఆనందింపజేసేవాడు), జిష్ణువు- జయశీలుడు అయిన కృష్ణుడు మరల కొలను వద్దకు చేరాడు. విరించి- బ్రహ్మ తమను వంచించి దాచిపెట్టిన సంవత్సర కాలాన్ని గొల్లపిల్లలు శ్రీవత్సు- కృష్ణుని మాయా ప్రభావంతో అర్ధక్షణంగా భావించారు. ఇసుక తిన్నెలపైన కూర్చొని కడు వేడుకతో చల్దులు కుడుస్తూ- ఆరగిస్తూ, నడుమంతరంగా- అర్ధాకలితో తినడం విడిచిన అన్నెం పున్నెం ఎరుగని ఆ గోపబాలురు కన్నయ్యను చూచి ఇలా అన్నారు..



**మ॥ 'చెలికాడా! అరుదెంచితే యిచటికిన్? సేమంబునం గ్రేపులున్**
**నెలవుల్ సేరె నరణ్య భూమి వలనన్ నీ వచ్చునందాక జ**
**ల్దులు వీరించుక యెవ్వరుం గుడువ, రాలోకింపు, రమ్మంచు నా**
**జలజాక్షుండు నగన్ భుజించి రచటన్ సంభాషలన్ డింభకుల్.**

'చెలికాడా! వచ్చావా? ఇదిగో చూడు, లేగదూడలు బాగా మేసి అరణ్యం మధ్యలో నుండి క్షేమంగా ఇప్పుడే ఇక్కడికి చేరాయి. నువ్వు తిరిగి వచ్చేవరకు మాలో ఎవడూ తినలేదు, చూడు! దొరా! రా, త్వరగా తిందాము' అంటూ మన్నన- ఆదరంగా పిలిచారు. బాలకృష్ణుడు నవ్వుతూ వచ్చి వారి నడుమ కూర్చోగానే పెచ్చరిల్లిన సంతోషంతో బాలకులంతా ముచ్చట్లు చెప్పుకొంటూ చల్దులు తిన్నారు. ఈ వృత్తాంతం ముగింపునకు రావడానికి ఒక సంవత్సరం పట్టింది. అందుకే గొల్లపిల్లలు ఇళ్లకు వెళ్లి 'అమ్మా! ఇవాళ్ల నల్లనయ్య పెద్ద కొండచిలువను చంపి మమ్ము కాపాడాడు' అని ఏడాది తరువాత తల్లులతో ఉల్లాసంగా వెల్లడించారు. పిమ్మట వనం నుండి బృందావనానికి బయల్దేరిన ఆపన్న భక్తావనుడు (ఆపదలో ఉన్న భక్తుల రక్షకుడు)- నందాత్మజుని, శిఖి (నెమలి) పింఛమౌళిని, భక్తకవివిరించి పోతన పంచచామర ఛందస్సులో ఎంత అంచితం (ఘనం)గా వర్ణించాడో విందాము..

**పం॥'ప్రసూన పింఛ మాలికా ప్రభా విచిత్రితాంగుడుం**
**బ్రసిద్ధ శృంగ వేణునాద పాశబద్ధ లోకుడుం**
**బ్రసన్న గోపబాల గీత బాహువీర్యుడయ్యును**
**ల్లసించి యేగె గోపకుల్ సెలంగి చూడ మందకున్'**

రాజా! తలమీద అలరారే అడవి పూల మాలలు, నెమలి పింఛం ధరించిన హరి- కృష్ణుడు, వాటినుండి వెలువడే పరి-పరి విధాల ప్రభలతో మెరిసిపోతున్నాడు. ప్రసిద్ధమైన కొమ్ము బూర నాదాలు, మధురమైన మురళీరవాలు అనే ప్రేమ పూరితాలైన పాశాలతో లోకాలను పరవశింపజేస్తున్నాడు. వల్లవ బాలురు మనోహరాలైన గీతాలతో తన బాహుబల పరాక్రమాలను కొనియాడుతుండగా బలానుజుడు బాలకృష్ణుడు ఉల్లాసంగా గొల్లపల్లెకు చేరాడు.

శుకముని- అవనీపతీ! రామకృష్ణులు పౌగండ వయస్కులై గోపబాలురతో కలిసి పశుపాలనం చేస్తూ, విహరిస్తూ బృందావనాన్ని పావనం చేశారు. అడవిలో వేడుకగా ఆడుకోవాలని నిశ్చయించిన వెన్నుడు అన్న రామన్నతో ఇలా అన్నాడు..

**శా॥ 'శాఖాపుష్ప ఫల ప్రభార నతలై చర్చించి యో దేవ! మా**
**శాఖిత్వంబు హరింపుమంచు శుక భాషన్ నీకెరింగించుచున్**
**శాఖా హస్తములం బ్రసూన ఫలముల్ సక్కన్ సమర్పించుచున్**
**శాఖి శ్రేణులు నీ పదాబ్జముల కోజన్ మ్రొక్కెడిం జూచితే'**

'అన్నా! కొమ్మల నిండా నిండి ఉన్న పూలగుత్తుల, పండ్ల భారంతో వంగి- వినయంగా నీ పాదాలు పట్టుకు వందిస్తున్న ఈ వృక్షబృందాలను వీక్షించు. తమపై కొలువున్న చిలుకల పలుకుల నెపంతో.. 'ఓ దేవా! మా ఈ పాదప(వృక్ష) జన్మలను పరిహరించి ఉత్తమ- పుణ్య జన్మను ప్రసాదించు' అని తమ చిరకాల వాంఛను నీకు విన్నవిస్తున్నాయి. అగ్రజా! తమ కొమ్మలనే పాణి- హస్తాలతో ఫలపుష్పాలు అర్పిస్తూ ఈ పాదపశ్రేణులన్నీ నీ పాదపద్మాలకు ఎలా ఎంచక్కా మొక్కుతున్నాయో ఒకసారి చూడు'.

**సీ॥'రా పూర్ణచంద్రిక! రా గౌతమీగంగ! రమ్ము భగీరథ రాజ తనయ!**
**రా సుధాజలరాశి! రా మేఘబాలిక! రమ్ము చింతామణి! రమ్ము సురభి!**
**రా మనోహారిణి! రా సర్వమంగళ! రా భారతీదేవి! రా ధరిత్రి!**
**రా శ్రీమహాలక్ష్మి! రా మందమారుతి! రమ్ము మందాకిని! రా శుభాంగి!'**

ఆవులు అడవిలో దూరదూరాల్లో మేస్తూ ఉంటే బాలగోపాలుడు మేఘగర్జన వంటి గంభీర కంఠస్వరంతో పేరుపేరునా 'ఓ పూర్ణచంద్రికా! ఓ గౌతమీగంగా! ఓ భాగీరథీ! రండు, రండు! ఓ సుధాజలధీరాశీ! ఓ మేఘబాలికా! ఓ చింతామణీ! ఓ సురభీ! రండు, రండు! ఓ మనోహారిణీ! ఓ సర్వమంగళా! ఓ భారతీదేవీ! ఓ ధరిత్రీ! ఓ శ్రీమహాలక్ష్మీ! ఓ మందమారుతీ! ఓ మందాకినీ! ఓ శుభాంగీ! రమ్ము, రమ్ము!' అని పలుకుతూ మరెన్నో పేర్లు పెట్టి ఆవులను ఆప్యాయంగా పిలిచేవాడు. ఆ ఇంపైన పిలుపు, వినసొంపైన పలకరింపుల తియ్యదనానికి బృందావనంలోని గోపబృందం ఆనందంతో మెచ్చుకొనేది... వ్యాస భాగవతంలో ఆవుల పేర్ల ఊసే- మాటే లేదు. మన పోతన వాసుదేవ కృష్ణుని చేత పలికించిన గోమాతల పవిత్ర నామాలను తన సీస పద్యమాలికలో పూసలవలె అందంగా గుదిగుచ్చాడు! శుక ఉవాచ- రాజా!

**సీ॥'వేదాంత వీధుల విహరించు విన్నాణి విహరించు గాంతార వీధులందు**
**ఫణిరాజ శయ్యపై బవళించు సుఖభోగి పల్లవ శయ్యల బవ్వళించు**
**గురుయోగి మానస గుహల గ్రుమ్మరు మేటి గ్రుమ్మరు నద్రీంద్ర గుహలలోన**
**గమలతోడ బెనగి కడు డయ్యు చతురు డాభీర జనుల తోడ బెనగిడయ్యు**
**ఆ॥ నఖిల లోకములకు నాశ్రయుండగు ధీరు**
**డలసి తరుల నీడ నాశ్రయించు**
**యాగ భాగ చయము లాహరించు మహాత్ము**
**డడవి లోని ఫలము లాహరించు'**

'బృహదారణ్యకాది వేదాంత- ఉపనిషత్ వీధుల్లో (మార్గాల్లో) సదా విహరించే విజ్ఞాని ఈనాడు ఇలా అరణ్య వీధుల్లో విహరిస్తున్నాడు కదా! అనాదిగా ఆదిశేషుని మృదువైన శయ్య- పానుపుపై పవళించే మహాభోగి, ఆహా! ఇప్పుడు వల్లవ (గొల్ల) బాలుడై పల్లవ (చిగురాకుల) పక్కల మీద పవ్వళిస్తున్నాడే! పరమయోగుల అంతరంగాలనే గుహలలో విహరించే యోగీశ్వరుడు ఇహలోకంలో- ఇక్కడ గొప్ప పర్వత గుహల్లో సంచరిస్తున్నాడు! కమలాలయ- శ్రీదేవితో క్రీడించి అలయు- అలసిపోవు కళా కుశలుడు ఈనాడు గొల్లపిల్లలతో ఆటలాడుతూ అలసి పోతున్నాడు! అఖిల లోకాలకు తానే ఆశ్రయమై అవిశ్రాంతం (నిర్విరామం)గా రక్షించే ధీరుడు నేడు అడవిలో బడలి విశ్రాంతికై పుడమి పుట్టువుల (చెట్ల) నీడలను ఆశ్రయిస్తున్నాడు! ధన్యులైన మునులు చేసే యాగాల హవిర్భాగాలను భుజించే పుణ్యకీర్తి ఈనాడు వన్య (అడవిలోని) ఫలాలను ఆరగిస్తున్నాడు'. సగుణ బ్రహ్మ- వాసుదేవుని భక్త సులభత్వాన్ని, భృశ్యవశ్యత్వాన్ని భాసురంగా వర్ణించిన శ్రీమంతమైన- ఈ సీస పద్యం పోతన అమాత్యుని సొంతం! (సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006